




గద్వాల కల్లులో నిషేధిత మందు


జమ్మిచేడులో మూత పడిన కల్లు దుకాణం

- నార్కోటిక్ పరీక్షల్లో బహిర్గతం
- ప్రజల ప్రాణాలపై తీవ్ర ప్రభావం
- మత్తు పదార్థాల నిరోధక చట్టం కింద కేసులు
- ఇందులో కాంగ్రెస్‌లోని రెండు వర్గాల నాయకులు
- పరస్పర ఫిర్యాదులతో అధికారుల దాడులు


కల్లు తయారు చేస్తున్న దృశ్యం

గద్వాల, సెప్టెంబరు 28: జోగుళాంబ గద్వాల జిల్లాలో కల్లు విక్రయదారుల మధ్య వర్గపోరు నడుస్తోంది. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో తెలంగాణ నార్కోటిక్ అధికారులు మెరుపుదాడులు చేశారు. వారి దాడుల్లో పట్టుబడిన కల్లు, తాగినవారి నుంచి సేకరించిన మూత్రం, రక్త నమూనాలల్లో నిషేధిత మత్తు పదార్థాలు ఉన్నట్లు బహిర్గతం అయ్యింది. దీంతో కేసులు నమోదు అయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

20 మందిపై కేసు..

హైదరాబాద్‌కు చెందిన నార్కోటిక్ అధికారులు శుక్రవారం సాయంత్రం నాలుగు బృందాలుగా ఏర్పడి గద్వాలలోని జమ్మిచేడు, వీరాపురం, పూడూరు గ్రామాలలోని కల్లు దుకాణాలతో పాటు మల్దకల్ మండలంలోని మద్దెలబండ గ్రామంలోని కల్లు దుకాణంపై దాడులు చేశారు. వీరికి గద్వాల పట్టణం, రూరల్, మల్దకల్ పోలీసులు సహకారం అందించారు. కల్లు దుకాణాలలో విక్రయిస్తున్న కల్లు శ్యాంపిల్స్‌తో పాటు కల్లు తాగిన వారి మూత్ర, కర్త నమూనాలను సేకరించారు. వారి మూత్ర నమూనాలలో నిషేధిత వత్తు పదార్థాలు ఉన్నట్లు తేలింది. రక్త నమూనాల పరీక్షలు ఇంకా బహిర్గతం కాలేదు. మూత్ర పరీక్షల్లో పాజిటివ్ తేలడంతో గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు, మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదు అయ్యింది. వివిధ సెక్షన్‌ల కింద మొత్తం 20మందిపై కేసు నమోదు అయ్యింది. ఇందులో ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు ఇద్దరు ఉండగా, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనుచరులు ఇద్దరు ఉండటం విశేషం. వీరందరు అప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

వర్గపోరుతో ఫిర్యాదులు..

గద్వాల నియోజకవర్గంలో కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య పోరు నడుస్తోంది. ఈ రాజకీయవర్గపోరు కల్లు విక్రయదారులపై పడింది. ఇప్పటికే ఒకర్గం వారిపై ఫిర్యాదులు ఉండటంతో నార్కోటిక్ అధికారులు గత జూలై మాసంలో దాడులు చేశారు. అప్పుడు నిర్వహించిన పరీక్షల్లో కూడా నిషేధిత మత్తు పదార్థాలు ఉండటంతో ముగ్గురుపై కేసు నమోదు చేశారు. వారిలో ఇద్దరిని అరెస్టు చేయగా మరొకరు ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. మూడు నెలలు గడువక ముందే మరోసారి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ సారి వచ్చిన ఫిర్యాదులు నార్కోటిక్ అధికారులకు తలనొప్పి కావడంతో నాలుగు బృందాలుగా ఏర్పడి ఒకేసారి పలు గ్రామాల్లోని కల్లు దుకాణాలపై దాడులు చేశారు. కల్లు శ్యాంపుల్స్‌తో పాటు కల్లు తాగిన వారి మూత్ర, కర్త నమూనాలను సేకరించారు. అందులో నిషేధిత మత్తు పదార్థాలు ఉన్నట్లు తేలింది.

కల్లు చుట్టే రాజకీయం

గద్వాల నియోజకవర్గంలో ఏళ్ల కాలం నుంచి కల్లుచుట్టే రాజకీయం నడుస్తోంది. రాజకీయ నాయకులకు ఇది ప్రధాన ఆదాయ వనరు కావడంతో కల్లు రాజకీయాలను నడిపిస్తోంది. ఏడాది పొడవునా రాజకీయ కార్యకలాపాలకు అయ్యే ఖర్చులను తీరుస్తుంది. గౌడ్ కులస్థులకు జీవనోపాధిగా ఉన్న ఈ కల్లు వారి కంటే రాజకీయ నాయకులకు అధికంగా మేలు చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కల్లు విక్రయాలలో రాజకీయనాయకులు జోక్యం ఉండటంతో కల్లు వ్యాపారులు కూడా రెండు వర్గాలుగా విడిపోయారు. అధికారంలో ఉన్న వారు కల్లు దుకాణాలు నిర్వహిస్తే ప్రత్యర్థివారు ఎక్సైజ్ వారికి ఫిర్యాదులు చేసేవారు. కానీ తీవ్రతరం ఉండేంది కాదు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే రెండు వర్గాలు ఉండి ఏకంగా నార్కోటిక్ అధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. అందుకే ఎప్పుడు లేని విధంగా మత్తుపదార్థాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసుకొని జైలుపాలు అవుతున్నారు. ఇది ఇలానే జరిగితే వృత్తినే నమ్ముకున్న గీత కార్మికులు జీవనోపాధి కోల్పోయి తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

అధికారుల అలసత్వం

- అనుభవ ధ్రువపత్రం ఇచ్చేందుకు నిరుద్యోగులతో ఆటలు
- స్థానిక పరీక్ష సెంటర్‌ను కోల్పోయిన అభ్యర్థులు
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది నిర్వాకం


జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) సెప్టెంబరు 28: కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ వచ్చిన నిరుద్యోగులకు ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీచేసింది. ఇన్నాళ్లు పనిచేసిన కాలానికి అనుభవ ధ్రువపత్రం తోడైతే కొన్ని మార్కులు కలిసి వచ్చి ప్రభుత్వ కొలువు వస్తుందనే ఆశతో వారు దరఖాస్తు చేసుకున్నారు. కానీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం అధికారులు మాత్రం నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అనుభవ ధ్రువపత్రం ఇచ్చేందుకు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థానికంగా పరీక్ష రాసే సెంటర్‌ను కోల్పోయామని, ఇక హైదరాబాద్‌కు వెళ్లి పరీక్ష రాయాల్సిన దుస్థితి ఏర్పడిందని నిరుద్యోగులు వాపోతున్నారు. జిల్లాలోని అన్ని విభాగాల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి అనుభవ ధ్రువపత్రాలు ఇచ్చినా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం అధికారులు ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు.

1,275 ఉద్యోగాలకు నోటిఫికేషన్

మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు రెగ్యులర్ ఉద్యోగాలకు రాష్ట్రవ్యాప్తంగా 1,275 ల్యాబ్‌టెక్నీషియన్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసింది. ఈ నెల 11 నుంచి దరఖాస్తులు స్వీకరించి అక్టోబరు 5 చివరి తేదీగా నిర్ణయించింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఖచ్చితంగా అనుభవ ధ్రువపత్రం ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆరు నెలలకు 2 మార్కుల చొప్పున ఐదేళ్ల పనిచేసిన వారికి 20 మార్కులు కలుపుతారు. ఇందుకోసం ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్‌డ్ పరీక్ష రాయాలి. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఈ కేంద్రాలు నిండి పోతే హైదరాబాద్‌కు వెళ్లి పరీక్ష రాయాలి. జిల్లాలోని ప్రభుత్వ వైద్యకళాశాల, జనరల్ ఆసుపత్రి పరిధిలో మొత్తం 50 మంది వరకు ల్యాబ్‌టెక్నీషి యన్లు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. వారందరికి ఆయా శాఖల అధికారులు అనుభవ ధ్రువపత్రాలు అందజేశారు. కానీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం అధికారులు మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని నిరుద్యోగులు వాపోతున్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో పరిధిలో మొత్తం 30 మంది వరకు ల్యాబ్‌టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. అందులో 104 అంబులెన్సులో 16 మంది, అర్బన్‌హెల్త్ సెంటర్లు, టీబీ సెంటర్లు-10, డీఎంఅండ్‌హెచ్‌వో పరిధిలో నలుగురు ఉన్నారు. వీరంతా రెగ్యులర్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోవాలని అనుభవ ధ్రువపత్రం కోసం డీఎం అండ్‌హెచ్‌వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కానీ, అధికారులు మాత్రం ఎప్పుడు పని చేశారు... ఎక్కడ పనిచేశారు.. అని కుంటిసాకులు చెబుతూ తిప్పుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.. అయినప్పటికీ అన్ని ధ్రువపత్రాలు సమర్పించారు. కానీ, వారు మాత్రం నిర్లక్ష్య ధోరణిని వీడలేదు. గత్యంతరం లేక స్థానిక ఎమ్మెల్యేను కూడా కలిశారు. ఆయన కూడా నేను చెప్తాను వెళ్లండని సర్దిచెప్పి పంపించారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లాకేంద్రంలో ఉండే సెంటర్లు వచ్చాయి. డీఎంఅండ్‌హెచ్‌వో అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనుభవ ధ్రువపత్రం ఆలస్యం చేయడంతో హైదరాబాద్‌లో పరీక్ష రాయాల్సిన దుస్థితి ఏర్పడింది. తాజాగా ఫార్మాసిస్టు, నర్సింగ్ రెగ్యులర్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ వేశారు. వాళ్లకు కూడా ఇదే పరిస్థితి ఎదురైతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్య ధోరణికి అడ్డుకట్ట వేసి నిరుద్యోగులకు సకాలంలో అనుభవ ధ్రువపత్రాలు ఇవ్వాలని కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

- సీఎం స్వగ్రామంలో కలెక్టర్ బదావత్ సంతోష్


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

వంగూరు, సెప్టెంబరు 28 : కొండారెడ్డిపల్లిలో చేపట్టిన అభివృద్ధి పనులు అక్టోబరు 8వ తేదీ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిని శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. దసరా రోజు సీఎం రేవంత్ రెడ్డి గ్రామానికి వస్తున్న సందర్భంగా పనులు వేగవంతంగా నాణ్యతగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రీశైలం హైవే నుంచి గ్రామం వరకు నాలుగు లేన్ల రహదారి, లైటింగ్, సోలార్ విద్యుత్ వంటి అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. చివరి దశలో కొనసాగుతున్న పనులు నాణ్యతగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో ప్రతీ ఇంటి పైకప్పుపై సోలార్ ప్లేట్ల బిగింపు పనులను ప్రారంభించాలన్నారు. దసరా లోపు కొండారెడ్డిపల్లి గ్రామం రాష్ట్రంలోనే ఒక మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ రమేష్, విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, చిన్న ఒబులేష్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, ఆర్డీవో శ్రీను, మాజీ ఉపసర్పంచ్ వేమారెడ్డి, కృష్ణారెడ్డి, బొజ్జ కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


ఆటో పైన కూర్చొని ప్రయాణిస్తున్న విద్యార్థులు

పట్టుతప్పితే ప్రమాదమే

గద్వాల క్రైం, సెప్టెంబరు 28 : చదువుకోవాలనే తపనతో నిరుపేద విద్యార్థులు ప్రమాదకరమైన ప్రయాణం చేస్తూ పాఠశాలకు వెళ్తున్నారు. పట్టుతప్పితే ప్రాణాలు కోల్పోయే ప్రమాద పరిస్థితిలో విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం ఒకే ఆటోలో దాదాపు 30మంది విద్యార్థులు ప్రయాణిస్తున్న దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. ఈ విద్యార్థులు అందరూ పూడురు ప్రాంతం నుంచి గద్వాల పట్టణంలోని రెవెన్యూ కాలనీ ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలకు వస్తుంటారు. వీరికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతీ రోజు ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకరమైన ప్రయాణం చేయక తప్పడం లేదు. ఆటో లోపల స్థలం లేకపోతే టాప్‌పై ప్రయాణం చేస్తున్నారు. డ్రైవర్ వేగం పెంచినా, సడన్‌గా బ్రేక్ వేసినా పరిస్థితి మరోలా ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. గతంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో పత్తి చేనుకు వెళ్లే కూలీలు ఇలా వెళ్లి ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.


బతుకమ్మలను తిలకిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...


బతుకమ్మతో వస్తున్న ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ శనివారం బతుకమ్మ ఆటలతో మహబూబ్‌నగర్‌లోని ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల సందడిగా మారింది. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆడిపాటి కనువిందు చేశారు. వారి అడుగుల్లో పాదం కదిపి పాటల్లో పదం కలిపి నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మరింత ఉత్సాహాన్నిచ్చారు. బతుకమ్మ పండుగను ముందే స్వాగతిస్తూ సాగిన ఈ వేడుకలో మహబూబ్‌నగర్, నారాయణపేట ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి అతిథులుగా హాజరయ్యారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో ఒకటని, తెలంగాణ వ్యాప్తంగా జరుపుకునే పెద్ద పండుగ అన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్ విద్యావిభాగం


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు


బతుకమ్మ ఆడుతున్న ఎన్టీఆర్ డిగ్రీకళాశాల విద్యార్థినులు


బతుకమ్మ ఆడుతున్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

వలస కూలీ దుర్మరణం


శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

మద్దూర్, సెప్టెంబరు 28 : భవనంపై నుంచి కింద పడి నారాయణపేట జిల్లా మద్దూర్ మండలానికి చెందిన వలస కూలీ మృతి చెందిన ఘటన మహారాష్ట్రలోని నాసి క్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దోరేపల్లికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ (50) ఉపాధి కోసం నాసిక్‌కు వలస వెళ్లాడు. భవన నిర్మాణ పనుల్లో భాగంగా ఏడో అంతస్తులో పనిచేస్తుండగా అదుపు తప్పి కింద పడి మృతి చెందిట్లు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలున్నారని గ్రామస్తులు తెలిపారు. పెద్దదిక్కు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

తిమ్మాజిపేట, సెప్టెంబరు 28 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటకు చెందిన వట్టెపు శేఖర్ (48) శనివారం చేపల కోసం చెరువులో దిగి మృతి చెందాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఇంటి నుంచి చేపలవేట కోసం గ్రామ సమీపంలోని రాళ్ల చెరువుకు వెళ్లాడు. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు చెరువులోకి వద్దని వారిస్తున్నా వినకుండా లోపలికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో భార్యకు సమాచారమిచ్చారు. గ్రామస్థులతో కలిసి చెరువు దగ్గరికి వెళ్లారు. కొందరు చెరువులోకి దిగి బయటకు తీసుకురాగా అతను అప్పటికే మరణించాడు. భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిల్వ చేసిన ఇసుక సీజ్


ఇసుకను పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీసులు

రేవల్లి, సెప్టెంబరు 28: వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని పాత తండా గ్రామ శివారులో జంప్లా నాయక్ పొలంలో దాదాపు 20 ట్రాక్టర్ల ఇసుక నిల్వ చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మీదేవి శనివారం స్థానిక పోలీసుల సహాయంతో ఘటనా స్థలానికి చేరుకుని ఇసుకను సీజ్ చేశారు. తహసీల్దార్ వెంట హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఇనుప పైపుల చోరీకి యత్నం

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 28 : నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెరగట్టులో ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో శుక్రవారం అర్ధరాత్రి ఇనుప పైపులను దుండగులు అపహరించేందుకు ప్రయత్నించారు. సెక్యూరిటీ సిబ్బంది ఇద్దరిని పట్టుకుని శనివారం పోలీసులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఇద్దరు దొరకగా, మిగతా వారు పారిపోయినట్లు పేర్కొన్నారు. కూరాకుల మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'బాపు బాటలో సత్యశోధన పాదయాత్ర' పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 28: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాపు బాటలో సత్యశోధన పాదయాత్ర పోస్టర్‌ను శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ బీ.ఎం.సంతోష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాదయాత్ర వంద రోజుల పాటు, వెయ్యి కిలోమీటర్ల మేర ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతుందన్నారు. అక్టోబరు 2న అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయం నుంచి ప్రారంభమై వంద రోజుల పాటు సాగనుందన్నారు. ఈ యాత్ర 2025, జనవరి 12న అచ్చంపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉమామహేశ్వర దేవాలయం వద్ద ముగుస్తుందన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో పిల్లల భవిత కోసం డాక్టర్ శివార్చక విజయకుమార్ సారథ్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో చేనేత వస్త్రధారణను ప్రోత్సహించడం, మద్యం, మత్తు మందుల వాడకాలను నివారించడం, స్వదేశీ వైద్యాన్ని ఆదరించడం, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం, యోగా, పౌష్టికాహారం, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, నైతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య కోసం కృషి చేయడం, ప్రకృతి పర్యావరణం, జీవ వైవిధ్యాన్ని కాపాడటం, పని సంస్కృతిని పెంపొందించడం, అలాగే సత్యం, అహింస పునాదులుగా సమసమాజాన్ని స్థాపించడానికి అడుగులు వేయడమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయకుమార్, నాగరాజు, వెంకటేష్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, సెప్టెంబరు 28 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఆరు గ్యారెంటీల హామీలు అమలు కాలేదని, ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం అక్టోబరు ఏడవ తేదీ లోపు ముఖ్యమంత్రి ఫొటో పెట్టాలని ఆదేశాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల డీఏ, పీఆర్‌సీ గురించి ఇప్పటి వరకు ఊసే లేదని తెలిపారు. ఎకరాకు రూ.7,500 రైతు భరోసా మా టెత్తడం లేదని, అరకొర రుణమాఫీతో చేతులు దులుపుకొని, అన్నదాతలను బ్యాంకులు కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు. రూ.నాలుగు వేల ఆసరా పింఛన్ పెంపు ఎప్పటి నుంచో చెప్పడం లేదని, మహిళలకు గృహ జ్యోతి కింద రూ.2,500 హామీ అటకెక్కించారని, కల్యాణలక్ష్మికి తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. అమ్మ ఒడి కింద రూ.12 వేలు, రూ. 13వేలు కేసీఆర్ కిట్ మాయం చేశారని, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ కట్ చేశారని తెలిపారు. హైడ్రా పేరుతో పేదల కంటికి కునుకు లేకుండా చేశారని పేర్కొన్నారు.

బస్సు ఢీకొని ఎంపీటీసీ మాజీ సభ్యుడికి గాయాలు

కొత్తకోట, సెప్టెంబరు 28: వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని పాలెం ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెద్దనర్సన్నకు శనివారం రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. కొత్తకోట చౌరస్తా సమీపంలో రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న ఆయనను వనపర్తి నుంచి ఆత్మకూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

హెచ్‌సీఏ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు గెలుపు



గెలిచిన మహబూబ్‌నగర్ జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28 : హెచ్‌సీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు గెలుపొందింది. శనివారం వరంగల్ స్టేడియంలో మహబూబ్‌నగర్, వరంగల్ జట్లు తలబడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆల్ ఔట్ అయ్యింది. జట్టులో మహ్మద్ షాదాబ్ 38, రామ్‌చరణ్ 13, రాఫె ఎనిమిది, అభిలాష్ ఆరు పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 29.4 ఓవర్లలో 87 పరుగులకు కుప్పకూలింది. జట్టులో ప్రదీవన్ 24 పరుగులు సాధించాడు. జిల్లా బౌలర్లలో ముఖీద్ 3, షాదాబ్ 2 వికెట్లు తీసి జిల్లా జట్టు విజయానికి కృషి చేశారు. జిల్లా జట్టు విజయం సాధించడంపై క్రీడాకారులను, కోచ్ అబ్దుల్లాను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు.

చెంచుల కోసం స్పెషల్ డ్రైవ్

-ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాల జారీ



ధ్రువపత్రాల కోసం హాజరైన చెంచులు

పదర, సెప్టెంబరు 28 : చెంచు గిరిజనులకు ఆధార్, రేషన్‌కార్డులతోపాటు కుల, స్థానిక, జనన, మరణ ఇతర ధ్రువపత్రాలను జారీ చేసేందుకు మూడు రోజుల స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని ఆర్డీవో మాధవి తెలిపారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలో ఆర్డీవో పర్యటించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని, గిరిజనులతో పాటు ఇతరులు కూడా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. శనివారం 200మంది గిరిజనులు హాజరైనట్లు తెలిపారు. ఆది, సోమవారం పదర, అమ్రాబాద్ మండలాల్లో, బుధ, గురువారం లింగాల మండలం గిరిజన భవన్‌లో, శుక్ర, శనివారం అచ్చంపేట సత్యలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో చెంచు గిరిజనుల కోసమే స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పదర డీటీ బిస్వా, ఆర్ఐ కృష్ణ, రెవెన్యూ, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు సాధ్యం

- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

వెల్దండ, సెప్టెంబరు 28: ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు సాధ్యమని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ పోలీస్ స్టేషన్‌ను ఐజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి నేరాలు, రోడ్డు ప్రమాదాల గురించి అడిగి తెలుసుకొన్నారు. ఐజీ మాట్లాడుతూ గంజాయి, పీడీఎస్ బియ్యం రవాణా అరికట్టాలని సూచించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి ఉన్నారు.

హార్టికల్చర్ కళాశాలను కొల్లాపూర్‌లోనే ఏర్పాటు చేయాలి

- పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము



మాట్లాడుతున్న బత్తిని రాము

కొల్లాపూర్, సెప్టెంబరు 28: హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలోనే కొనసాగించాలని పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పీజీ కళాశాలలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొల్లాపూర్ విద్యాపరంగా అత్యంత వెనుకబాటుకు గురవుతుందన్న ఆలోచనతో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను ప్రవేశ పెట్టాలని పలు దఫాలుగా పోరాటం నిర్వహించామన్నారు. దీని ఫలితంగా ప్రభుత్వం రెండేళ్ల క్రితం కొల్లాపూర్ ప్రాంతానికి హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. కళాశాల ప్రారంభంలో ఆర్ఐడీ పాఠశాలలో ప్రవేశాలు తీసుకుని ఇక్కడ సరైన వసతులు లేవని కారణంతో కొత్తకోటలోని మోజర్లకు కళాశాలను తరలించారన్నారు. ఈ ప్రాంత విద్యార్థుల ఉపాధి లక్ష్యంగా ఏర్పాటు చేసిన కళాశాల ఇలా తరలివెళ్లడం ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తక్షణ మే ఆ కళాశాలను ఇక్కడ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్య దర్శి దాసు, శేఖర్, భరత్‌యాదవ్, కృష్ణ, సుమన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులను ఆదుకోవాలని వినతి



నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవికి వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు

కల్వకుర్తిటౌన్, సెప్టెంబర్ 28 : తమను ఆదుకోవాలని పాడి రైతులు శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిని హైదరాబాద్‌లో, విజయ డెయిరీ చైర్మన్ అమిత్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఇప్పటికి రెండు నెలల పాల బిల్లులు అందించారని, మిగతా రెండు నెలల బిల్లును దసరా పండుగ వరకు అందజేయాలని వారు కోరారు. సమస్యలు విన్న వారు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలాజీసింగ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీశైలం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

- బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- 42 శాతం రిజర్వేషన్ సాధించడం తమదే బాధ్యత
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి, సెప్టెంబరు 28 : కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపర్చాలని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బీసీల సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ మహాధర్నాకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం బీసీ గురుకులాలను పట్టించుకోవడం లేదని, విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫల మైందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 25 బీసీ గురు కులాలు ఉంటే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 220బీసీ గురుకులాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారంగా బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అమలు పర్చాలని, జనాభా ప్రా తిపదికన అన్ని విభాగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీ ఆర్, కేటీఆర్‌లు స్థానిక సంస్థలో బీసీల రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నారని తమిళ నాడులో బీసీల కు అమలవుతున్న రిజర్వేషన్లను అమలుపర్చడానికి బీఆర్ఎస్ బృందాన్ని పంపించిందని ఆయన గుర్తు చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లనే ప్రభుత్వం కూలుస్తున్నదని మండిపడ్డారు.

- బీసీ కుల గణన, 42 శాతం రిజర్వేషన్ అమలు బాధ్యత కాంగ్రెస్ పార్టీ తరఫున తాను తీసుకుంటున్నాని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రకటించారు. కొంతమంది సంపాదించిన డబ్బులతో బీసీల ఓట్లు కొల్లగొడుతున్నారని విమర్శించారు. ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ బీసీల రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓసీల చివరి ముఖ్యమంత్రి అవుతారని, రాబోయేది బీసీ ముఖ్యమంత్రేనని పేర్కొన్నారు. బీసీలంతా తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, ఉప్పల వెంకటేష్, ఉమా జంగయ్య ఉన్నారు.

బహుజన రాజ్యం రావాలి

చారకొండ: రాష్ట్రంలో బహుజన రాజ్యం రావాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని సిర్సనగండ్ల పరిధిలోని అయోధ్యనగర్ (గుట్ట)లో సీతారామ చంద్రస్వామి ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీసీ నాయకులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలని అన్నారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలో జరిగే బీసీ మహాధర్నాకు బయలుదేరారు.

విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘనస్వాగతం

- ఓపెన్ టాప్ జీపుపై ఊరేగింపు
- ఘనంగా సన్మానించిన పూర్వ విద్యార్థులు



ఉపాధ్యాయులతో ఊరేగింపు నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు

కొల్లాపూర్, సెప్టెంబరు 28 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ జిల్లా పరిషత్ గాంధీ స్మారక ఉన్నత పాఠశాలలో 1986-87 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 37 తర్వాత కలుసుకున్న వారంతా తమ బాల్యాన్ని నెమరువేసుకుంటూ, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఓపెన్ టాప్ జీపుపై పూర్వ ఉపాధ్యాయులను పూలు చల్లుతూ బాణసంచా కాల్చుతూ వారికి అపూర్వ స్వాగతం పలికారు. వారిని శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కె.రామచంద్రారెడ్డి, ఎన్.కన్నయ్య, కె.వెంకటస్వామి, హెచ్.బాబురావు, కె.సుదర్శన్, టి.నారాయణ మాట్లాడారు. తాము విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు జీవితంలో ఒక్కో రంగంలో స్థిరపడి తమకు ఇలాంటి గౌరవం కల్పించడం సంతృప్తినిచ్చిందని పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ బాల్య జీవితాన్ని సంక్షిప్త వివరాలతో పుస్తక రూపంలో ప్రచురించి గురువుల చేత ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల తరగతి గదులను సందర్శించి, ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయులను కలిశారు. గాంధీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు కె.మోహన్‌రాజు, ఆర్.కృష్ణ, నాగరాజు, కిరణ్‌కుమార్, సుధాకర్‌సింగ్, నరేంద్రనాథ్, భాస్కర్, షాలిమియా, జగదీశ్వర్, పవన్, జి.రాధాకృష్ణ, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంతో సమస్య పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా సెషన్స్ జడ్జి యం.ఆర్ సునీత

వనపర్తి అర్బన్, సెప్టెంబరు 28: కక్షిదారులు రాజీ మార్గంతో సమస్య పరిష్కరించుకోవాలని జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ యం.ఆర్ సునీత అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శనివారం ఉదయం వనపర్తి కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్‌తో పాటు ప్రపంచ డెఫ్ డే (వినికిడి లోపం) కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు, ఈఎన్‌టీ చెకప్ శిబిరాన్ని నిర్వహించారు. న్యాయవాదులతోపాటు జాతీయ లోక్ అదాలత్‌కు వచ్చిన కక్షిదారులు, వినికిడి సమస్యలు పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా సెషన్స్ జడ్జి మాట్లాడుతూ... చిన్న చిన్న గొడవలు, బ్యాంకు రుణాలు, భార్యాభర్తల కేసులు, సివిల్ కేసులు వంటి వాటి వల్ల మనశ్శాంతి లేకుండా ఉంటుందని, ఇరువురు కక్షిదారులు ఒక్క అడుగు కిందికి దిగి రాజీపడి కేసు ఉపసంహరించుకుంటే ఇద్దరికీ మనశ్శాంతి, ఆరోగ్యం ఉంటుందన్నారు. రాజీమార్గం ఉంటే కోర్టు కేసులు లేకుండా ఉండొచ్చని తెలిపారు. నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో అమరచింత, వనపర్తి కలిపి 2,944 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారం అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయచంద్రమోహన్ మాట్లాడుతూ... మంచి ఆహారం, వ్యాయామం, యోగా ఆచరించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి రజిని, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మోహన్ కుమార్ యాదవ్, వైస్ చైర్మన్ కృష్ణయ్య, మొదటి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బండారి శ్రీలత, రెండో జూనియర్ సివిల్ జడ్జి వై.జానకి, ఉత్తరయ్య, శ్రీదేవి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరుల సమస్యలను పరిష్కరించాలి



డీఎఫ్‌వో రోహిత్ గోపిడిని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

మన్ననూర్, సెప్టెంబరు28: గొర్రెల కాపరుల సమస్యలను పరిష్కరించాలని యాదవ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాశన్న యాదవ్ డీఎఫ్‌వో రోహిత్ గోపిడికి విన్నవించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో మన్ననూరులోని అటవీ అతిథి గృహంలో డీఎఫ్‌వోను శనివారం కలిసి సమస్యలను వివరించారు. గొర్రెల కాపరులంతా సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, సమస్యలపై చర్చిద్దామని డీఎఫ్‌వో యాదవ నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వోను సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మల్లయ్య యాదవ్, రామలింగయ్య యాదవ్, వెంకటేష్ యాదవ్, మహేష్ యాదవ్ , మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

దిక్కుతోచని స్థితిలో రియల్టర్లు

- ప్లాట్లు, ఇళ్ల కొనుగోలుకు వెనుకాడుతున్న ప్రజలు
- అప్పుల పాలై హైదరాబాద్‌లో మకాం
- వ్యాపారుల్లో అత్యధికులు ప్రభుత్వ ఉద్యోగులే..



వనపర్తి శివారులో వెలసిన వెంచర్లు

వనపర్తి అర్బన్, సెప్టెంబరు 28 : ఒక్కసారిగా ఆకాశానికి ఎగిసిన రియల్ భూమి అంతే వేగంగా నేలను తాకింది. దీంతో ఎకరాల భూములు కొని వెంచర్లు వేసిన వాళ్లతో పాటు, బిల్డర్లు దిక్కు తోచని స్థితిలో అప్పులు కట్టలేక పరారీలో ఉన్నారు. ఒకప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వనపర్తి జిల్లా పెట్టింది పేరు. కొన్నేళ్ల తరబడి నుంచి వనపర్తిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా కొనసాగింది. 2016 లో జిల్లా ఏర్పడిన తర్వాత ఈ రంగం మరింత ఊపందుకుంది. అంతకుముందు ఉన్న మార్కెట్ రేట్ల కంటే డబుల్ అయ్యింది. గత సంవత్సరం నుంచి జిల్లాలో వ్యాపారం కుదేలైంది. ఎక్కడబడితే అక్కడ వెంచర్లు, ఇష్టానురీతిగా ధరలు పెంచి అమ్మడంతో కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

వడ్డీకి తెచ్చి.. వ్యాపారంలో పెట్టి

పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పొలాలు బీళ్లుగా మారగా, కొన్ని ప్రాంతాల్లో వెంచర్లు వెలిశాయి. కొందరు బడా రాజకీయ నాయకులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్ద మొత్తంలో దందా ప్రారంభించి భూములు కొనుగోలు చేసి నష్టపోయారు. ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద మొత్తంలో బ్యాంకు లోన్లు తీసుకొని రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు వారి పరిస్థితి దయనీయంగా మారింది. మరి కొందరు వెంచర్లు వేయడంతో పాటు బిల్డర్లుగా మారి ఇళ్లు నిర్మించారు. ఇప్పుడు అవి అమ్ముడుపోకపోవడంతో అప్పులపాలై ఉద్యోగాలను వదిలివేసి హైదరాబాద్‌లో మకాం వేశారు. ఐదు రోజుల క్రితం పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఓ కానిస్టేబుల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ బిల్డర్‌తో కలిసి రియల్ ఎస్టేట్ రంగంలో రూ.2 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాడు. అవి ఇప్పుడు అమ్ముడు పోక అప్పుల బాధతో వెళ్లిపోతున్నానని తన భార్యకు మెసేజ్ పెట్టి అదృశ్యమయ్యాడు. ఇప్పటి వరకు అతని ఆచూకీ లభ్యం కాలేదు. ఈ ఘటనపై వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కింద కేసు కూడా నమోదైంది. చాలా మంది ఉద్యోగులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి అప్పుల బాధ తట్టుకోలేక ఇళ్లను వదిలేసి, ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకొని వెళ్లిపోయారు.

హైడ్రా ప్రభావం కూడా కారణమే

హైదరాబాద్ కేంద్రంగా అక్రమ కట్టడాలను గుర్తించి హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) నేలమట్టం చేస్తుంది. హైడ్రా హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకుండా ఆయా జిల్లాల్లో అక్రమ కట్టడాలను నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఇప్పటికే అధికారులు వనపర్తి జిల్లా కేంద్రంలో ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ జోన్‌లో ఉన్న అక్రమ కట్టడాలను గుర్తించి నోటీసులు కూడా ఇచ్చారు. దీంతో ప్లాట్ల కొనుగోలు, కట్టిన ఇళ్లు కొనాలనుకునే వెనుకంజ వేస్తున్నారు.

కురుమూర్తి ఆలయానికి నిధులు మంజూరు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 28: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి ఆలయానికి కలెక్టర్ విజయేందిర బోయి శనివారం నిధులు మంజూరు చేశారు. త్వరలోనే ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో తాగునీటి సమస్యపై దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కలెక్టర్ దృ ష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ తన నిధుల నుంచి రూ.34లక్షలు మంజూరు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

కోస్గి, సెప్టెంబర్, 28 : మండలంలోని కొత్తపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఉత్సవ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం తెల్లవారు జామున చోరీ జరిగినట్లు గుర్తించి గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ బాలయ్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలయంలో ఉన్న సీతారాముడు, లక్ష్మణుడి ఉత్సవ విగ్రహాలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుడు వెంకట్రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ తీగలు తెగిపడి మహిళకు గాయాలు

మక్తల్ రూరల్, సెప్టెంబరు 28 : విద్యుత్ తీగలు తెగిపడి మహిళకు గాయాలైన ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కొండదొడ్డిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండగట్టుకు చెందిన రంగమ్మ ఇంటి వద్ద గిన్నెలు తోముతుండగా వీధి లోని విద్యుత్ తీగలు తెగి ఆమెపై పడ్డాయి. దీంతో ఆమె చేతికి తీవ్ర గాయమైంది. వెంటనే సోదరుడు రంగన్న కర్ర సాయంతో విద్యుత్ తీగను తీసివేసి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో ప్రాణాపాయం తప్పింది. రంగమ్మ స్పృహ కోల్పోవడంతో మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

సీసీ కెమెరాలు మాయమైన ఘటనపై విచారించాలి

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్



మాట్లాడుతున్న రాచాల యుగంధర్ గౌడ్

వనపర్తి టౌన్, సెప్టెంబరు 28 : జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సీసీ కెమెరాలు మాయమైన ఘటనపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం అడిషనల్ కలెక్టర్ నగేష్‌ను కలెక్టరేట్‌లో కలిసి మాట్లాడారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినయ్ ప్రభుపై కలెక్టర్ ఆదర్శ్ సురభికి ఫిర్యాదు చేశామన్నారు. ఆయన మూడు నెలలుగా విధులకు హాజరు కాకుండా ఇంటి వద్దకే రిజిస్టర్ తెప్పించుకుని సంతకాలు చేసి జీతం తీసుకుంటున్నాడని తెలిపారు. అతనిపై చర్యలు తీసుకోవాలని గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సాక్ష్యాలు దొరకకూడదనే శుక్రవారం కెమెరాలు మాయం చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కలెక్టరేట్‌లోనే ఇలా జరగడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైందని, ఈ ఘటనపై విచారణ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాఘవేందర్ గౌడ్, బాలరాజు యాదవ్, భరత్, మహేందర్ నాయుడు, శివ గౌడ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన మల్దకల్ విద్యార్థులు



శరణ్యగౌడ్

మల్దకల్, సెప్టెంబరు 28: జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఫుట్‌బాల్ క్రీడా పోటీలలో ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం నరేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆనంద్‌కుమార్ తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో అమరవాయి జడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థి అశోక్, అండర్-17 బాలికల విభాగంలో పదో తరగతి విద్యార్థిని ఉరుకుందమ్మ ఎంపికయ్యారు. మెదక్, భద్రాచలంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాల పదో తరగతి విద్యార్థిని శరణ్యగౌడ్ ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది విద్యార్థిని కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మధులిక రెడ్డి అభినందించారు.

చెక్‌డ్యాంలో దూకేందుకు యత్నం

- తల్లి, పిల్లలను రక్షించిన పోలీసులు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 28: భర్తతో గొడవపడిన భార్య పిల్లలతో సహా చెక్‌డ్యాంలో దూకేందుకు ప్రయత్నిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు వారిని అడ్డుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలు ఇలా.. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ చెందిన రాములు, అశ్విని భార్యాభర్తలు. వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె తన ముగ్గురు కుమార్తెలతో కలిసి శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని చెక్‌డ్యాం వద్దకు చేరుకుంది. ఆమె అందులోకి దూకే ప్రయత్నం చేస్తున్న క్రమంలో అలుగా పెట్రోలింగ్ కోసం వెళ్తున్న పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు, మల్లికార్జున్ గమనించారు. ఆమె వద్దకు వెళ్లి సమస్య తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

పరిసరాల శుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

- జడ్చర్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి లక్ష్మి
- కోర్టు ఆవరణలో పిచ్చి మొక్కల తొలగింపు



కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న న్యాయాధికారులు లక్ష్మి, ముద్దాసిర్

జడ్చర్ల, సెప్టెంబరు 28 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని జడ్చర్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి లక్ష్మి అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం జడ్చర్ల కోర్టు ఆవరణలో చెత్తను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వాతావరణం సైతం అనుకూలంగా ఉంటుందన్నారు. జడ్చర్ల అడ్వకేట్స్ బార్ అసోసియేషన్, పోలీసు, కోర్టు సిబ్బందితో కలిసి కోర్టు ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దాసిర్, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జంగయ్య, యాదిరెడ్డి, మాలిక్ షాకీర్, విశ్వేశ్వర్, రాములు, అఫీసా, కోర్టు సిబ్బంది దేవా, లింగం, మహేష్, కైకేయి, శివకుమార్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

హన్వాడ, సెప్టెంబరు 28 : మండల కేంద్రంలో శనివారం ప్రజా కవి, పద్మవిభూషణ్ గుర్రంజాషువా జయంతిని జిల్లా బుద్ధ ఆరామ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గొప్ప రచయిత అని, కులం, మతం లేకుండా అన్ని వర్గాల కోసం పని చేసిన వ్యక్తి ఆయన అన్నారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు బాలకిష్టయ్య, మాజీ వైస్ఎంపీపీ కొండ లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ నాగన్న, నాగయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు జంబులయ్య, నాయకులు చిన్నచెన్నయ్య, గంగాపురి, వెంకటయ్య, రావుల కిష్టయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28 : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం స్థానిక స్టేడియం మైదానంలో మహబూబ్‌నగర్ అర్బన్ మండల అండర్-14, 17 కబడ్డీ, ఖోఖో ఎంపికలను నిర్వహించారు. ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. మండల స్థాయి ప్రతిభ చాటిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికావాలని ఆకాంక్షించారు. మండలంలో వివిధ పాఠశాలల నుంచి 300 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరైనట్లు కార్యనిర్వాహక కార్యదర్శి విలియం తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు మెర్సి, బాలరాజు, శ్రీనివాసులు, సాదత్‌ఖాన్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పోమాల లింగం

- వ్యవసాయ శాఖ మంత్రి నుంచి ఉత్తర్వులు జారీ



చైర్మన్ లింగం, వైస్ చైర్మన్ తులసీరాం నాయక్

నవాబ్‌పేట, సెప్టెంబరు 28 : మండల కేంద్రంలోని బాలాజీ మార్కెట్ కమిటీకి కొత్త పాలక వర్గాన్ని నియమిస్తూ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఆయన సోదరుడు దుశ్యంత్ రెడ్డి పరిశీలన సామాజిక వర్గాలను పరిగణలోకి తీసుకున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో బీసీ యాదవ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వగా ఈ సారి బీసీల్లో ముదిరాజ్ వర్గానికి ప్రాధాన్యత ఇచ్చారు. చైర్మన్‌గా పోమాల లింగం, వైస్ చైర్మన్‌గా కొల్లూర్ మాజీ ఎంపీటీసీ తులసీరాం, డైరెక్టర్లుగా కొత్త నరేష్, తోకల పద్మమ్మ, నర్సింహులు, గొల్ల వెంకటేష్, శంకర్ నాయక్, కోస్గి ప్రభాకర్, పిట్టల లాలయ్య, బిల్లకంటి పురుషోత్తంరెడ్డి, జమీరొద్దీన్, శివకుమార్, చంద్రమోహన్, రాఘవేందర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

- భగత్‌సింగ్ జయంతిలో సీపీఎం నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 28 : సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అమెరికా దాని మిత్ర దేశాలు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అభ్యుదయవాదులంతా భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని సీపీఎం నాయకులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తిలు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నేడు ప్రపంచంలో అమెరికా దురాగతాలకు పాల్పడుతున్నదని, వెనుకబడ్డ దేశాలపైన ఆంక్షలు, షరతులు పెట్టి ఆయా దేశాల పైన ఒత్తిడికి పాల్పడుతోందన్నారు. భగత్‌సింగ్ 17ఏళ్ల వయసులో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. నేడు ప్రపంచంలో పాలస్తీనా-ఇజ్రాయిల్ యుద్ధం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అమెరికా ప్రోత్సాహం తోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచంపై పెత్తనం కోసం అమెరికా చేస్తున్న దురాగతాలను అడుగడుగునా ఖండించాలన్నారు. కార్యక్రమంలో చంద్రకాంత్, వేణుగోపాల్, గాలెన్న, ఆంజనేయులు, భాస్కర్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ సేవలు మరువలేము

నవాబ్‌పేట, సెప్టెంబరు 28 : దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంలో కీలకపాత్ర పోషించిన భగత్‌సింగ్ సేవలు మరువలేనివని ఛత్రపతి శివాజీ యువజన సంఘం నాయకులు వడ్ల సురేష్ అన్నారు. శనివారం మండలంలోని ఇప్పటూర్ గ్రామంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలూమాలలు వేసి నివాళ్లు అర్పించారు. దేశస్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలను ముద్దాడిన వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



తహసీల్దార్‌కు గోడు వినిపిస్తున్న ఇళ్ల యజమానులు

దేవరకద్ర సెప్టెంబరు 28 : మండలకేంద్రంలోని మల్లయ్య పాపయ్య కుంట పరిసరాల్లో నిర్మాణం చేసుకున్న ఇళ్ల యజమానులు తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. కుంట సమీపంలో నిర్మించుకున్న ఇళ్లు పట్టాభూములో ఉన్నాయని, కొందరు కావాలనే రాజకీయ కుట్ర కోణంతో తమపై ఫిర్యాదులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని యజమానులు కోరారు. ఈ విషయంలో తాము విచారించి చట్ట ప్రకారంగా సర్వే నిర్వహించి జిల్లా ఉన్నతాధికారులకు సర్వే నివేదికను అందించి న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ భరోసా కల్పించారు.

వచ్చే నెల మూడు నుంచి దేవీ శరన్నవరాత్రులు

నవాబ్‌పేట, సెప్టెంబరు 28 : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారి సన్నిధిలో అక్టోబరు మూడవ తేదీ నుంచి 12వరకు దేవీశరన్నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మదనేశ్వరెడ్డి గురువారం తెలిపారు. 3న గణపతి పూజ, అఖండదీపారాధన, కలశస్థాపన, ధ్వజారోహణం, 4న విశేష చక్రపూజ, కైంకర్య, 5న అమ్మవారికి విశేషంగా పంచామృతాభిషేకం, అలంకరణ, 6, 7వ తేదీలలో నిత్య కైంకర్యంతో పాటు విశేషంగా అమ్మవారి పూజ, 9న సరస్వతి పూజ, రుత్విక్ వర్ణము, పుణ్యాహవచకం, నవగ్రహదేవారధన, మండల దేవాతాహ్వానము, ఆరాధన, దుర్గవాహనం, హోమం, మధ్యాహ్నం పూర్ణాహుతి, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ, 10న ఆయుధపూజ, 11న మహార్ణవమి, దేవిపూజ, 12న విజయదశమి, అమ్మవారికి అభిషేకం, అలంకరణ, దేవారాధన, సాయంత్రం 4 గంటలకు జమ్మిపూజ, ధ్వజ అవరోహనంతో కార్యక్రమాలు సమాప్తి అవుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

ఉత్సవాలకు ముస్తాబు

మూసాపేట, సెప్టెంబరు 28 : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అక్టోబరు 3 నుంచి 12 వరకు దేవీశరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లతో పాటు అమ్మవారి మండపాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. మూసాపేట, సంకలమద్ది, కొమిరెడ్డిపల్లి, జానంపేట, నిజాలాపూర్, పోల్కంపల్లి, చక్రాపూర్, వేముల తదితర గ్రామాల్లో ఆలయ కమిటీ, దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాల కొనుగోలు, అమ్మవారి రోజు వారి వివిధ రూపాల అలంకరణ, జానపద, ఆటపాటలు, బతుకమ్మ ఆటపాటల కార్యక్రమాల నిర్వహణకై ప్రణాళికలు చేపట్టారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

-క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం



కబడ్డీలో గెలుపొందిన క్రీడాకారులతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, సెప్టెంబరు 28 : భవిష్యత్ బాగుండాలంటే మంచిగా చదువుకోవాలని, మా ప్రభుత్వం చదువు కోసం ఎంతో ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలో ఎమ్మెల్యే పర్యటించారు. హన్వాడలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం రామన్నపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనం, మన ఊరు మనబడి కింద రూ.41 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. షేక్‌పల్లి గ్రామంలో పర్యటించి రూ.20 లక్షలతో నిర్మించనున్న హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మాదారంలో రూ.8 లక్షలతో నిర్మించనున్న గ్రంథాలయ భవనానికి భూమి పూజ చేశారు. నాగంబాయి తండాలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో రాయితీ సిలిండర్ల ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందించారు. ఆయా గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటాద్రి, సొసైటీ మాజీ చైర్మన్ యాదయ్య, జిల్లా నాయకులు కృష్ణయ్య, విజయకుమార్, కృష్ణయ్య కలీం, యాదవరెడ్డి, కుల్కచర్ల శ్రీనివాస్, శ్రీశైలం, గోపాల్, గోవిందమ్మ, బొట్టు శ్రీను, నవనీత, బాల్‌రెడ్డి, ఎంపీడీవో యశోదమ్మ, తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంఈవో గోపాల్‌నాయక్, హెచ్‌యం మల్లేష్, గ్రామ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

● మండలంలోని వేపూర్ గ్రామంలో బోగం శివకుమార్ అనారోగ్యంతో మృతిచెందగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. యాదయ్య, యాదవరెడ్డి, నాయకులు వెంట ఉన్నారు.

మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చుదాం

- మత్తు పదార్థాల నిర్మూలన కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయేందిర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 28 : మహబూబ్‌నగర్‌ను మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పిలుపునిచ్చారు. ఇందుకుగాను అన్ని కళాశాలలు, విద్యాసంస్థల్లో వర్క్ షాపులు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. వచ్చే గురువారం నుంచి ఒక కళాశాలలో వర్క్ షాప్ నిర్వహించాలన్నారు. శనివారం కలెక్టర్ తన చాంబర్‌లో నిర్వహించిన మత్తు పదార్థాల నిర్మూలన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే నెల నుంచి ప్రతీ గురువారం ఒక కళాశాలలో గంటన్నర పాటు వర్క్ షాప్ నిర్వహించాలని స్పష్టం చేశారు. అన్ని కళాశాలలు, పాఠశాలల్లో మత్తు పదార్థాల వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని, అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. యువ టూరిజం క్లబ్బులపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఆ రోజు తనతో పాటు, జిల్లా ఎస్పీ, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ, జిల్లాలోని ముఖ్యమైన అధికారులు ఆ కళాశాలకు వెళ్లి అవగాహన చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, అదనపు ఎస్పీ రాములునాయక్, ఆర్‌డీవో ఈ.నవీన్, డీఈవో రవీందర్ హాజరయ్యారు.

రేపటి నుంచి ప్రజావాణి : కలెక్టర్

మహబూబ్‌నగర్ టౌన్/ జడ్చర్ల/ హన్వాడ/ మూసాపేట/ కోయిలకొండ/ సెప్టెంబరు 28 : ఈ సోమవారం నుంచి మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులకు వ్యయప్రయాసాలను తగ్గించి వారు ఉండే చోటనే వారి సమస్యలు పరిష్కరించేందుకు ఎంతో దోహపడు తుందని అన్నారు. ప్రజావాణి పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. హన్వాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యశోదమ్మ తెలిపారు. మూసాపేటలోని రైతు వేదికలో ఈ నెల 30న ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కోయిలకొండ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కాళప్ప తెలిపారు. జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

రేబిస్‌వ్యాధిపై అప్రమత్తత అవసరం

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి.మధుసూదన్‌గౌడ్



మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బి.మధుసూదన్‌గౌడ్

పాలమూరు, సెప్టెంబరు 28 : ప్రజలు రేబిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.మధుసూదన్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ప్రజలు, జంతుప్రేమికులకు అవగాహన కల్పించారు. ఉదయం జాతి శునకాలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైనదన్నారు. ప్రతీఒక్కరు పశువైద్యుల సూచనలు పాటించాలన్నారు. వీధి కుక్కల సంఖ్య తగ్గించటానికి ప్రభుత్వం జనన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయిస్తుందన్నారు. సుమారు 100పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మమత, మహబూబ్‌నగర్ పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శివానందస్వామి, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ నరేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

● మిడ్జిల్ : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై పశువైద్యాధికారి శివరాజ్ అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, వ్యాక్సినేషన్ షెడ్యూల్, జంతుసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని పెద్దగుండ్లతండాతీలో జెర్సీ ఆవులకు గర్భకోశవ్యాధి నివారణ చికిత్సలు చేసి, 22 హెచ్ఎఫ్ జెర్సీ ఆవులకు మందులను అందజేసినట్లు డాక్టర్ శివరాజ్ తెలిపారు. జీహెచ్ఎం సరస్వతి, వెటర్నరీ సిబ్బంది సాగర్, వేణుగోపాల్, పాఠశాల ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల నాటికైనా పాలకవర్గం కొలువుదీరేనా?



◀◀ కురుమూర్తి వేంకటేశ్వరస్వామి రాజగోపురం

చిన్నచింతకుంట, సెప్టెంబరు 28 : మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు దాదాపు నెలరోజుల్లో ప్రారంభం అవుతున్నందున అందరి దృష్టి ఇప్పుడు ఆలయ నూతన పాలకవర్గంపై ఉంది. రెండు నెలల క్రితం ఆలయ పాలకవర్గం ఏర్పాటుకు సంబంధించిన నోటిఫికేష న్‌ను దేవాదాయశాఖ నుంచి జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్ సూచన మేరకు 14 మందితో కూడిన పాలకవర్గం జాబితాను దేవాదాయశాఖకు పంపించినట్లు తెలిసింది. నోటిఫికేషన్ వచ్చి రెండునెలలు కావస్తున్నా కొత్త పాలకవర్గం ఇంకా కొలువుదీరలేదు. దీంతో త్వరలో ప్రారంభం కానున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలకు భక్తులు వివిధ రకాల వసతులు, ఏర్పాట్లు, జిల్లా ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షలు, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేయటం వంటి వాటిని పూర్తి చేయాలన్నా పాలకవర్గం ఏర్పాటు ఆవశ్యకత ఎంతో ఉంది. ఇప్పటి వరకు పాలకవర్గం ఏర్పాటు కానందున బ్రహ్మోత్సవాలకు సంబంధించి భక్తులకు ఏర్పాట్ల విషయంలో అసౌకర్యం కలిగే అవకాశం ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

దసరా నాటికి కొత్త పాలకవర్గం

కురుమూర్తి వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గం ఏర్పాటు దసరా పండుగలోపు అయ్యే అవకాశం ఉంది. 14 మంది సభ్యులతో కమిటీని దేవాదాయశాఖకు పంపించారు. త్వరలోనే నూతన పాలకవర్గం ఏర్పాటు అవుతుంది.

- మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ ఈవో

లోక్ అదాలత్‌కు విస్తృత ప్రచారం కల్పించాలి

- జిల్లా న్యాయాధికారి పాపిరెడ్డి
- లోక్ అదాలత్‌లో ఒకేరోజు 11037 కేసుల పరిష్కారం
- ఒక్కటైన భార్యాభర్తలు..పరిహారంలో కుదుర్చుకున్న రాజీ



పరిహారం అందుకుంటున్న బాధితులు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 28 : లోక్ అదాలత్‌లో ఒకేరోజు 11037 కేసులు పరిష్కారం అయ్యాయని, విస్తృత అవగాహన కల్పిస్తే ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి పాపిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టులో నాలుగు బెంచ్‌లు, జడ్చర్ల కోర్టులో 2 బెంచ్‌లు ఏర్పాటు చేశారు. పోలీసులు, న్యాయవాదుల కృషి ఫలితంగా కక్షిదారులు పెద్దఎత్తున కోర్టుకు చేరుకుని తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకున్నారు. ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో భార్యాభర్తల మధ్య 498 ఏ కేసు నడుస్తోంది. ఈ కేసులో భార్యాభర్తల మధ్య సఖ్యత కుదిర్చి రాజీ చేశారు. తిరిగి చక్కగా కాపురం చేసుకుంటామని కోర్టులో అందరి ముందు భార్యాభర్తలు దండలు మార్చుకున్నారు. సివిల్ కోర్టులో సోదర, సోదరీమణుల మధ్య భూమికి సంబంధించి భాగపరిష్కారం కోసం కేసు దాఖలు చేయగా, రూ.15 లక్షలకు లోక్ అదాలత్ సభ్యుల మధ్య పరిష్కరించుకుని వారి బంధాలను మళ్లీ మెరుగుపరుచుకున్నారు. ఇలా లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారం అయ్యాయి. జిల్లా న్యాయాధికారి పాపిరెడ్డి మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులను పరిష్కరింపజేసుకునేందుకు లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కళ్యాణ్‌చక్రవర్తి, మూడవ అదనపు జిల్లా జడ్జి ఆర్ శ్రీదేవి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర, మూడవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి నిహారిక, 4వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి భావన, డీఎస్పీ వెంకటేశ్వర్లు, గవర్నమెంట్ ప్లీడర్ శ్రీనివాస్‌గౌడ్, బార్ అసోసియేషన్ కార్యదర్శి రాంనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

● జడ్చర్ల : జడ్చర్ల కోర్టులో మండల్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 794 కేసులను పరిష్కరించినట్లు జడ్చర్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి లక్ష్మి తెలిపారు. అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జంగయ్య, న్యాయవాదులు మాలిక్ షాకీర్, అశోక్, మహేశ్వర్‌రెడ్డి, పురుషోత్తం, రేమశ్, అబ్దుల్‌కరీమ్, కోర్టు సిబ్బంది, జడ్చర్ల, బాలానగర్, రాజాపూర్ పోలీస్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మల్లు నర్సింహారెడ్డి

- వచ్చేనెల మొదటి వారంలో ప్రమాణ స్వీకారం



మల్లు నర్సింహారెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్, సెప్టెంబరు 28 : మహబూ బ్‌నగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోటకదిర మల్లు నర్సింహారెడ్డి నియమితులయ్యారు. అధికారిక ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. మల్లు నర్సింహారెడ్డి నాలుగు దశబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు ఆయన అనేక పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ కోసం, పార్టీ అభివృద్ధికి నిత్యం కృషిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి రాజేశ్వ ర్‌గౌడ్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మొన్నటి వరకు కొనసాగారు. మరోసారి మహబూబ్‌నగర్ రూరల్ మండలానికే జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కడంతో మండల ప్రజలు, రాజకీయ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ముఖ్యనాయకులు నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చేనెల మొదటివారంలో ప్రమాణ స్వీకారం ఉంటుంది.

సొంత డబ్బులతో రోడ్డును బాగు చేసుకున్న తండావాసులు

మిడ్జిల్, సెప్టెంబరు 28: మండలంలోని మంగళిగడ్డ తండా గ్రామ పంచాయతీ తుల్యానాయక్‌తండాలో ఇటీవల వర్షాలకు రోడ్డు కోతకు గురై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలు మార్లు రోడ్డు బాగుచేయించాలని అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ హరిలాల్ నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్‌లు తమ సొంత డబ్బులతో రోడ్డుకు మొరం మట్టి పోయించి మరమ్మతులు చేయించారు. పలువురు తండావాసులు వారిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సీతారాంనాయక్, గోపాల్‌నాయక్, వినోద్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, రమేష్‌నాయక్, అరుణ్‌నాయక్ ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోండి

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 28 : జిల్లాలోని నిరుద్యోగ, యువతీ, యువకులు ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జర్దోషి, కంప్యూటర్, ఏసీ మెకానిక్, మొబైల్ రిపేర్, సీసీ కెమెరా, హౌస్ వైరింగ్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇప్పటికే 14 బ్యాచ్‌ల శిక్షణ పూర్తి చేశామని పేర్కొన్నారు. 15వ విడత శిక్షణ కోసం ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబరు 10వ తేదీలోగా, పాత డీఈవో కార్యాలయంలో గల వృత్తి శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441565895 నంబర్‌ను సంప్రందించాలని కోరారు.

రేపు మూసాపేటలో ఎమ్మెల్యే పర్యటన

మూసాపేట, సెప్టెంబరు 28 : మండలంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి శేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ మహిళా రిసోర్స్ సెంటర్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ఇందిర మహిళా శక్తి క్యాంటీన్, ఉదయం 10:30 గంటలకు రైతు వేదికలో మహాలక్ష్మి పథకం ద్వారా రాయితీ రూ.500 గ్యాస్ సిలిండర్ లబ్ధిదారులకు ధ్రువప్రతాల పంపిణీ, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

మురుగునీటి శుద్ధి ప్లాంటు పరిశీలన



ప్లాంటును పరిశీలిస్తున్న కమిషనర్

జడ్చర్ల, సెప్టెంబరు 28 : జడ్చర్ల మునిసిపాలిటీలోని 14వ వార్డులోని మినీ ట్యాంకుబండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న మురుగు నీటిని శుద్ధిచేసే వాటర్ ప్లాంటు పనులను శనివారం మునిసిపల్ కమిషనర్ రాజయ్య పరిశీ లించారు. మురుగునీటిని శుద్ధి చేసి, స్వచ్ఛమైన నీటిని తయారు చేస్తుందని కమిషనర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అమృత్‌జల్ పథకంలో భాగంగా ఈ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు

కోయిలకొండ, సెప్టెంబరు 28 : గ్రామాల్లో వయో వృద్ధులను అన్యాయంగా వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రాజాగణేష్ హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం కమిటీ ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీనియర్ సిటిజన్స్ ఫోరం చైర్మన్‌గా తహసీల్దార్, కమిటీ సభ్యులుగా ఎంపీడీవో, డాక్టర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏపీఎం ఉంటారని తెలిపారు. వయోవృద్ధులకు భోజనం పెట్టకుండా ఇబ్బందులు గురిచేస్తే కమిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కాళప్ప, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అంబిక, జగదీశ్వరి, తిరుపతమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా కోర్టు పీపీగా బాలస్వామికి అదనపు బాధ్యతలు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 28 : జిల్లాకోర్టు పీపీగా బాలస్వామికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన మహిళా కోర్టు రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నారు. ఈ బాధ్యతలతో పాటు జిల్లాకోర్టు పీపీగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. న్యాయవాదుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు అనంతరెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఆయనను అభినందించారు.

బలిజ సంఘం అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్

కోయిలకొండ, సెప్టెంబరు 28 : వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం మండల అధ్యక్షుడిగా చిన్నలింగాల్‌చేడ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారు. శనివారం మండలంలోని అచార్యపూర్ వీరభద్రస్వామి దేవాలయంలో మండల కమిటీని జిల్లా నాయకులు ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా సంపత్ కుమార్ ఎంపికయ్యారు. జిల్లా నాయకులు కొండ వీరన్న, శివకు మార్, సిద్దిలింగం, వినోద్‌కుమార్, శ్రీశైలం, శ్రీదేవి, నాగమణి పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ అండర్-14,17 తైక్వాండో ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28 : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా తైక్వాండో అండర్-14,17 ఎంపికలను ఆదివారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఓ ప్రకటనలో తెలిపారు. 01-01-2011 తరువాత జన్మించిన వారు అండర్-14, 01-01-2008 తరువాత పుట్టిన వారు అండర్-17 ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

గండీడ్, సెప్టెంబరు 28 : ఉపాధ్యాయ వృతి ఎంతో గౌరవమైనదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ అన్నారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు కొండయ్యను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈవో జనార్దన్, వెంకటయ్య, హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, యూనియన్ నాయకులు జైపాల్‌రెడ్డి మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొని సన్మానించారు.

జీవో 25ను సవరించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 28 : అశాస్త్రీయమైన సర్దుబాటు జీవో 25ను ప్రభుత్వం వెంటనే సవరించాలని ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు నిలుపుదల చేయాలని యూఎస్‌పీఎస్ జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు వెంకటేష్, రవికుమార్, ఆదిత్య, వెంకటేశ్వర్లు, మహమూద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ముందు నిరసన చేశారు. అనంతరం కలెక్టర్ విజయేందిర బోయికి వినతి పత్రం ఇచ్చారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు బదిలీలు, పదోన్నతులు అప్పీలుకు సానుకూలంగా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణమ్మ, శ్రీశైలం, ఖాదరయ్య, శివరాజ్, నరేష్, అజయ్, సంధ్యారాణి, కురుమయ్య పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి'

దేవరకద్ర, సెప్టెంబరు 28 : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చేందాయని బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణంరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని గురకొండ గ్రామంలో బీజేపీ సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

భాషా పండిత విజయం పుస్తకావిష్కరణ

జడ్చర్ల, సెప్టెంబరు 28 : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సంఘం సంక్షిప్త చరిత్రను వివరించే భాషా పండిత విజయం పుస్తకాన్ని శనివారం మండలంలోని కోడ్గల్ జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. స్కూల్ అసిస్టెంట్ (భాషలు) పోస్టులు పండితులకే కేటాయించాలని దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగి, సాధించిన విజయాన్ని పుస్తకంలో పొందుపరిచినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఉపాధ్యాయులు షాహినాపర్వీన్, సురేంద్రనాథ్, తాహెర్, హనుమాన్‌సింగ్, మంజుల, ప్రమీలాబాయి, అబ్దుల్లా, బస్వయ్య పాల్గొన్నారు.

రేపు సహకార సంఘం సమావేశం

నవాబ్‌పేట,సెప్టెంబరు 28: మండల కేంద్రంలోని యన్మనగండ్ల సహకార సంఘం వార్షిక సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు సహకార సంఘం చైర్మన్ మాడెమోని నర్సింహులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల రైతులు హాజరై సమావేశంలో చర్చించే అంశాలను విని ప్రభుత్వ రుణాలు, ఇతర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డైరెక్టర్లు, రైతులు, మండల ప్రజలు హజరుకావాలని కోరారు.